సాక్షి తిరుపతి

శనివారం । 22 । మార్చి । 2025



పశువులకు వడదెబ్బ ముప్పు

ఎండలు ముదురుతున్నాయి. మూగ జీవాలకు ఎండ దెబ్బ తగిలే ప్రమాదం ఉందని పశువైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. - 8లో



పది ఎకరాల కబ్జాకు యత్నం

గూడూరు నియోజకవర్గంలో కూటమి కాలకేయులు రెచ్చిపోతున్నారు. ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సా)	సహర్ ఆదివారం (ఉ)
తిరుపతి	6-27	4-56
గూడూరు	6-21	4-52

న్యూస్‌రీల్

కేజీబీవీల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లాలోని ఐదు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) ఖాళీగా ఉన్న సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సర్వశిక్ష ఎక్స్ అఫిషియో కో–ఆర్డినేటర్, డీఈఓ కేవీఎన్.కుమార్ తెలిపారు. కేజీబీవీల్లో 2025–26 విద్యా సంవత్సరంలో 6, 11 తరగతుల్లో కొత్తగా ప్రవేశం పొందేందుకు, అలాగే 7, 9, 10 తరగతులు, ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు), పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దారిద్రరేఖకు దిగువ ఉన్న విద్యార్థులే అర్హులని, ఆన్‌లైన్ దరఖాస్తులనే అడ్మిషన్లకు పరిగణించబడతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీలోపు 'ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్'' అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు వారి ఫోన్ నంబరుకు సమాచారం అందుతుందని తెలిపారు. వివరాలకు 70751 59996, 70750 39990 నంబర్లలో సంప్రదించాలని డీఈఓ కోరారు.

ఇంగ్లిష్ పరీక్షకు 413 మంది గైర్హాజరు

తిరుపతి అర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు 413 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు డీఈఓ కేవీఎన్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 26,840 మంది రెగ్యులర్ విద్యార్థులు, 57 మంది ప్రైవేటు విద్యార్థులు, ఓపెన్ స్కూల్స్‌కు సంబంధించి 966 మంది హాజరవ్వాల్సి ఉండన్నారు. అయితే ఇందులో 413 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు వెల్లడించారు.

ఒక విద్యార్థి డిబార్

సత్యవేడు మండలంలోని ఏపీఎస్‌డబ్ల్యూ బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ఓ విద్యార్థి కొన్ని కాగితాలతో ఉన్నట్టు ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో గుర్తించారని డీఈఓ తెలిపారు. దీంతో ఆ విద్యార్థిని డిబార్ చేయడంతోపాటు ఆ గదిలోని ఇన్విజిలేటర్ ఎస్.వెంకటేశ్వరరావు(ఎంపీపీఎస్ యనటీ స్కూల్ ఎస్జీటీ ఉపాధ్యాయుడు, సత్యవేడు మండలం)ను సస్పెండ్ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

డీఎస్పీ సుకుమారికి ఉత్తమ సేవా పతకం



చంద్రగిరి: కల్యాణీ డ్యాం సమీపంలోని పీటీసీలో పనిచేస్తున్న డీఎస్పీ సుకుమారికి ఉత్తమ సేవా పతకం, ఆర్ఎస్ఐ ఆనంద నాయుడు సేవా పతకానికి ఎంపికైనట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరికి తెలుగు నూతన సంవత్సరం ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం చేతుల మీదుగా పతకాలు అందించి సత్కరించనుంది. ఈ మేరకు శుక్రవారం పీటీసీలోని పలువురు సిబ్బంది వారిని అభినందించి, సత్కరించారు. గతంలోనూ డీఎస్పీ సుకుమారి అనేక అవార్డులు, రివార్డులను అందుకున్నారు.

24న డీసీ కార్యాలయాల వద్ద ఆందోళన



లత



ఉషారాణి

తిరుపతి అర్బన్: తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 24న తిరుపతి, చిత్తూరు జిల్లాల సమన్వయకర్తల కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేయనునట్టు ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షురాలు లత, కార్యదర్శి ఉషారాణి వెల్లడించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈనెల 27న చలో మంగళగిరి వెళ్లనున్నట్టు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కార్యాలయం వద్ద నిరసనలు చేపట్టనున్నట్టు తెలిపారు. 17 ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బంది సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

27న స్థానిక సంస్థల ఉప ఎన్నిక

తిరుపతి అర్బన్: జిల్లాలో స్థానిక సంస్థలకు సంబంధించి ఖాళీ అయిన చోట్ల ఉప ఎన్నికలు నిర్వహించడానికి ఎలక్షన్ కమిషన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తిరుపతి రూరల్ ఎంపీపీతోపాటు రేణిగుంట మండలంలోని గురవరాజుపల్లి, చంద్రగిరి మండలంలోని రామిరెడ్డిపల్లి, కోట మండలంలోని ఎస్పీ కొత్తపాళెం, ఎర్రావారిపాళెం మండలంలోని చింతగుంట పంచాయతీల ఉప సర్పంచ్‌లకు ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

రెక్కాడితే గానీ డొక్కాడని గని కార్మికులపై కూటమి ప్రభుత్వం కక్ష గట్టింది. మైకా, క్వార్ట్జ్, క్వారీ పరిశ్రమలకు అనుమతులివ్వకుండా వేధిస్తోంది. తొమ్మిది నెలలుగా చేతినిండా పనిలేక పేదలు పస్తులతో కాలం గడపాల్సి వస్తోంది. గనుల్లో వాచ్‌మన్ దగ్గర నుంచి జేసీబీ, ప్రొక్లెయిన్, ట్రాక్టర్లు, టిప్పర్లు, కార్మికులు ఇలా ఎందరో అర్ధాకలితో అలమటించాలి వస్తోంది. వీరిపై ఆధారపడిన పలు దుకాణాలు సైతం బోసిపోవడం సైదాపురంలో నిత్యకృత్యంగా మారుతోంది.

సంక్షోభ ఖనిజం



కార్మికులు లేక బోసిపోయిన మైకా గని ప్లాంట్

ముద్ద దిగని బతుకులు

- మూత పడిన క్వార్ట్జ్ గనులు
- తొమ్మిది నెలలుగా ఇదే తంతు
- పనుల్లేక డొక్కలు మాడ్చుకుంటున్న పేదలు
- బోణీల్లేవంటున్న అంగడి యజమానులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని సైదాపురం మండలంలో కోట్లాది రూపాయాల గనులు, మైకా గనులు ఉన్నాయి. ఇక్కడ అపారమైన ఖనిజ నిక్షేపాలున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇవ్వన్నీ మూతపడ్డాయి. నూతన పాలసీ పేరిట వీటిని మూసివేశారు. ఆ తర్వాత జూన్ 12 నుంచి మైకా పరిశ్రమలన్నీ సిండికేట్ల చేతుల్లోకి వెళ్లిపోయాయి. కొన్ని గనుల్లో పనులు నామమాత్రంగా జరుగుతున్నాయి. మిగిలినవి పూర్తిగా మూతపడ్డాయి. ఫలితంగా వీటిపై ఆధారపడ్డ ఐదు వేల కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో చిక్కుకుపోయాయి. కార్మికులకు ఉపాధి లేక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమకు న్యాయం చేయాలంటూ వేడుకుంటున్నా అధికారులు కనికరం చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అందరిపైనా ప్రభావం

గడిచిన తొమ్మిది నెలల్లో పల్స్‌పర్, మైకాకే పర్మిట్లు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు.

వాటికి అనుమతి ఎప్పుడో?

మైకా పరిశ్రమ పూర్తిగా ఓ ముఖ్యనేత కనుసన్నల్లోకి వెళ్లిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం సైతం సదరు వ్యక్తికి అప్పజెప్పడంతో ఈ రంగం కుదేలైంది. ప్రధానంగా గిద్దలూరు, కలిచేడు గ్రామాల్లో ఉన్న రెండు ప్రధాన గనులకు నేటికీ అనుమతులు లభించలేదు. వీటిపై ఆధారపడిన వేలాది మంది కూలీలు వీధిన పడ్డారు.

ప్రస్తుతం వాటిల్లోనూ తూతూమంత్రంగానే పనులు జరుగుతున్నాయి. ఈ సంక్షోభం కార్మికుల పైనే కాకాకుండా యాజమాన్యాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం క్రయవిక్రయాలు పూర్తిగా నిలిచిపోవడంతో మైకా పరిశ్రమ తీవ్ర నష్టాల్లో కూరుకుపోయింది.

ఆశలు.. అడియాశలు


సైదాపురం, పొదలకూరు, గూడూరు మండలాల్లోని కార్మికులు అధికం మైకా గనులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. తొమ్మిది నెలలుగా పనుల్లేక ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. మరో వైపు గని కార్మికుల్లో అధిక శాతం కూటమి ప్రభుత్వానికే ఓటు వేశారు. గతానికి భిన్నంగా గత ఎన్నికల్లో సైదాపురం మండలంలో కూటమి ప్రభుత్వానికి భారీ మెజారిటీ వచ్చింది. తమకు మంచి జరుగుతుందనే వీరి ఆశలు అడియాశలయ్యాయి. మైకా పరిశ్రమలకు వెళ్లే కూలీలతో కళకళలాడే సైదాపురం నేడు బోసిపోయింది. రవాణా వ్యవస్థ స్తంభించింది. వాహన యజమానులతో పాటు లోడింగ్‌చేసే కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు న్యాయం చేయాలంటూ పలువురు కార్మికులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతున్నారు.

143 నుంచి 80కి

మండలంలో గతంలో 143 గనులు పనిచేస్తుండగా ప్రస్తుత వీటి సంఖ్య 80కి పడిపోయింది. అందుబాటులో ఉన్న గనులు, క్వారీలకు అనుసంధానంగా పది ఫ్యాక్టరీలున్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా 15 వేల మంది, పరోక్షంగా మరో 15 వేల మంది ఉపాధి పొందుతున్నారు. వీటిలో 90 శాతం మంది జిల్లా వాసులే.



పనులు చూపాలంటూ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కార్మికులు(ఫైల్)



నిర్మానుష్యంగా ఉన్న మైకా గని లోపల ప్రాంతం

బతుకు నాశనం

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మా జీవితాలను నాశనం చేశారు. మా ఊరి దగ్గర్లోని గనిలో కూలి పనులకు వెళ్తున్నా. 45 ఏళ్లుగా ఈ గనిమీదే ఆధారపడి జీవిస్తున్నా. తొమ్మిది నెలలుగా గనులు మూసివేయడంతో పనుల్లేక అల్లాడుతున్నాం.

– రాజమ్మ, గని కార్మికురాలు

బోణీలు కూడా కాలే



నేను 30 ఏళ్లుగా సైదాపురంలో టిఫిన్ అంగడి పెట్టుకుని జీవిస్తున్నా. ప్రస్తుతం గనులు మూతపడడంతో వ్యాపారం బోసిపోయింది. గడిచిన తొమ్మిది నెలల్లో హోటళ్లు, చిల్లర దుకాణాలు సైతం మూతపడ్డాయి.

– మంజులమ్మ, టిఫిన్ షాపు యజమాని

కూలి పనులు దొరకడం లేదు



యజమాని వారానికొక సారి మా ఖాతాల్లోకి గానీ, నేరుగా గానీ డబ్బులు ఇచ్చేవారు. అయితే ప్రస్తుతం ఉపాధి కరువైయింది. పనులు దొరకడం గగనంగా మారింది. కుటుంబాన్ని పోషించుకోవడం కష్టతరంగా మారుతోంది. కూటమి ప్రభుత్వమొచ్చాకే ఇలా జరుగుతోంది.

– టీ.సుబ్రమణ్యం, గని కార్మికుడు

వీధిన పడ్డాం



గ్రామాల సమీపంలోని క్వార్ట్జ్‌ల్లో పనులకెళ్లి ఎంతో కొంత డబ్బులు సంపాదించే వాళ్లం. అయితే ప్రస్తుతం పనుల్లేక వీధిన పడ్డాం. మా బతుకును రోడ్డున పడేశారు. వెంటనే గనులకు అనుమతులిచ్చి కష్టాలను తీర్చాలి.

– చెంచయ్య, కార్మికుడు

మధ్యవర్తిత్వంపై ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా న్యాయ సేవ సంస్థ సెక్రటరీ

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 44 మంది న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై తిరుపతి రాస్ భవనంలో నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా న్యాయ సేవా సంస్థలు, తిరుపతి మండల న్యాయ సేవ అధికార సంస్థ సంయుక్తంగా మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు అవగాహన తరగతులు నిర్వహించినట్టు తెలిపారు. శిక్షణ ఇచ్చిన ఢిల్లీ హైకోర్టు న్యాయవాది అనుజ సక్సేన, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయవాది ఎంఎస్ నినాకరేలను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.

మధ్యవర్తిత్వంతో నష్టం లేదు

మధ్యవర్తిత్వం నిర్వహించి కేసులను పరిష్కరించడం వల్ల న్యాయవాదులకు ఎటువంటి నష్టం ఉండదని సీనియర్ ట్రైనీ, ఢిల్లీ హైకోర్టు న్యాయవాది అనుజ సక్సేన తెలిపారు. శుక్రవారం తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ హాల్లో తిరుపతి మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవ సంస్థ సెక్రటరీ భారతి, తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గోపీచంద్, ప్రధాన కార్యదర్శి మారిన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు

సాక్షి, న్యూఢిల్లీ: తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలోని శ్రీకాళహస్తిలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరుగుతున్నాయని, ఈ దాడులపై స్పందించాలని జాతీయ మానవ హక్కుల సంఘానికి వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం చైర్మన్ వీ.రామసుబ్రమణియన్‌ను కలిసి దాడులకు సంబంధించిన వివరాలు, ఫిర్యాదు అందజేశారు. నేటికీ ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రాణభయంతో షికారీ కుటుంబాలు గ్రామాల్ని వదిలేస్తున్నారని తెలిపారు. అక్కడ అన్ని దాడులు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దీనిపై స్పందించి, ఆ దాడులకు పాల్పడుతున్న వారికి సరైన బుద్ధి చెప్పాలని, శిక్షించాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో 12 మందికి ఉగాది పురస్కారాలు



జే.వెంకట్రావు, ఏఎస్పీ; ఆర్.వినోద్‌కుమార్, సీఐ, సైబర్ క్రైమ్; ఎల్.మునిరత్నం రెడ్డి, ఏఎస్ఐ, వెస్ట్ పోలీస్ స్టేషన్; భక్తవత్సలం రాజు, ఏఎస్ఐ, పిచ్చాటూరు; డీ. ఏడుకొండలు, ఏఆర్‌హెచ్‌సీ 3754; ఐ. బ్రహ్మ నాయక్, ఏఆర్‌హెచ్‌సీ 3872; జీ.రమేష్ బాబు, ఏఆర్‌హెచ్‌సీ 1263



జీ.ప్రసన్నాంజనేయులు, ఏఆర్‌హెచ్‌సీ 1338; డీ.మల్లికార్జున రావు, ఏఆర్‌హెచ్‌సీ 3386; ఈ.నిర్మల, వెస్ట్ పీఎస్ హెచ్‌సీ 616; పీఎస్.భాస్కర్, ఏఎస్ఐ, 453 అలిపిరి

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లాలో 12 మందికి ఉగాది పురస్కారాలను ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో ఏఎస్పీ జే. వెంకట్రావు, ఆర్.వినోద్‌కుమార్(సైబర్ క్రైమ్ సీఐ), ఎల్.మునిరత్నంరెడ్డి(ఏఎస్ఐ వెస్ట్ పోలీస్ స్టేషన్), పీ.శివకుమార్ రెడ్డి(ఏఎస్ఐ తడ పీఎస్), భక్తవత్సలంరాజు(ఏఎస్ఐ పిచ్చాటూరు పీఎస్), డీ.ఏడుకొండలు(ఏఆర్‌హెచ్‌సీ 3754), ఐ.బ్రహ్మనాయక్(ఏఆర్ హెచ్ 3872), జీ.రమేష్‌బాబు(ఏఆర్‌హెచ్‌సీ 1263), జీ.ప్రసన్నాంజనేయలు(ఏఆర్‌హెచ్‌సీ 1338), డీ.మల్లికార్జునరావు(వీఆర్‌హెచ్‌సీ 3386), ఈ.నిర్మల(వెస్ట్ పీఎస్ హెచ్‌సీ 616)కు సేవా పథకాలు వచ్చాయి. అదేవిధంగా ఏఎస్ఐ 453 అలిపిరి పీఎస్ భాస్కర్‌కు ఉత్తమ సేవ పతకం లభించింది.

శ్రీసిటీలో 'ఓజేఐ ఇండియా' ప్రారంభం

శ్రీసిటీ(సత్యవేడు): ఓజేఐ గ్రూపు అనుబంధ సంస్థ ఓజేఐ ఇండియా ప్యాకేజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన పరిశ్రమ శుక్రవారం శ్రీసిటీలో ప్రారంభించింది. కంపెనీ కస్టమర్లు, సరఫరాదారులు, ఇతర ప్రతినిధుల సమక్షంలో చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకాహషి, ఓజీ హోల్డింగ్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ అండ్‌గ్రూప్ సీఈఓ హిరోయుకి ఇసోనే, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఓటీ ఇండియా ప్యాకేజింగ్ సీఈఓ యోషియుకి కురహషి లాంచనంగా రిబ్బన్ కత్తిరించి కంపెనీని ప్రారంభించారు. దేశంలో ఇది ఐదో ప్లాంట్ కాగా, దక్షిణ భారత దేశంలో అతి పెద్దది. ఈ సందర్భంగా హిరోయుకి ఇసోనో మాట్లాడుతూ సుస్థిరత, ఆవిష్కరణల ద్వారా నిర్మించిన ఈ శ్రీసిటీ ప్లాంట్, దక్షిణ భారత దేశ ప్యాకేజింగ్ అవసరాలకు అనుగుణంగా పనిచేస్తుందన్నారు. యోషియుకి కురహషి మాట్లాడుతూ భారత్‌లో ఓటీ ప్రమాణాన్ని, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. జౌజీ గ్రూప్ విస్తరణ జపాన్– భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని మునియో తకాహషి వ్యాఖ్యానించారు.



ప్రారంభోత్సవంలో మునియో తకాహషి, హిరోయుకి ఇసోనో, రవీంద్ర సన్నారెడి, యోషియుకి కురహషి

ఆగిపోయిన మెమో రైలు

దొరవారిసత్రం: చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్లే మెమో రైలు ఇంజిన్‌లో సాంకేతిక లోపం ఏర్పడడంతో శుక్రవారం సాయంత్రం 4.20 గంటల ప్రాంతంలో దొరవారిసత్రం రైల్వే స్టేషన్‌కు సమీపంలో డౌన్‌లైన్ పట్టాలపై 99 కి.మీ వద్ద అవుటర్‌లో ఆగిపోయింది. అదే సమయంలో వెనుకనే బెంగళూరు నుంచి వయా చెన్నై మీదుగా వచ్చిన ధనాపూర్ ఎక్స్‌ప్రెస్ దొరవారిసత్రం రైల్వే స్టేషన్‌లో 4.40 గంటలకు ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ఎండ తీవ్రతకు అల్లాడిపోయారు. మెమో రైల్లోని ప్రయాణికులు మాత్రం జాతీయ రహదారి బాట పట్టి ఎవరి పాటికి వారు ఆయా ప్రాంతాలకు వెళ్లిపోయారు. రాత్రి 7.10 గంటలకు గూడూరు నుంచి ఇంజిన్ రావడంతో మెమో రైలు కదిలింది. వెనుకనే దనాపూర్ ఎక్స్‌ప్రెస్ కూడా కదిలింది.



దొరవారిసత్రం రైల్వే స్టేషన్‌లో ఆగిపోయిన ధనాపూర్ ఎక్స్‌ప్రెస్



సాంకేతిక లోపంతో ఆగిపోయిన మెమో రైలు

లోకేష్ వద్దకు చేరిన ఓటేరు పంచాయితీ

శ్రీకాళహస్తి: తిరుపతి రూరల్ పరిధిలో ఆక్రమణకు గురవుతున్న ఓటేరు చెరువు పంచాయితీ మంత్రి లోకేష్ వద్దకు చేరింది. శుక్రవారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు మంత్రి లోకేష్‌ను కలిసి ఓటేరు చెరువు గురించి ప్రస్తావించినట్లు సమాచారం. గత వారంలో ఎస్సీవీ నాయుడు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మధ్య ఓటేరు చెరువు విషయమై వివాదం నెలకొంది. అది చెరువు భూమి కాదని ఎస్సీవీ నాయుడు, చెరువులను రక్షించాలంటూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి బాహాబాహికి దిగారు. దీంతో టీడీపీలో అంతర్గత కుమ్ములాటలు బయటపడ్డాయి. దీనిపై మంత్రి ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.



లోకేష్‌తో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

రాత్రి బ్లాస్టింగ్.. పగలు లోడింగ్



ప్రభుత్వ భూముల్లో తెల్లరాయి తవ్వకాలతో ఏర్పడ్డ గుంతలు



- ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- క్షేత్ర స్థాయి అధికారికి భారీగా ముడుపులు
- రాత్రికి రాత్రే తెల్లరాయి తరలించేస్తున్న కూటమి నాయకులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: గూడూరు నియోజకవర్గంలో కూటమి నేతలు ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారు. వారికి అండగా 'నేను ఉన్నా' అని స్థానిక ప్రజాప్రతినిధి భరోసా ఇస్తుండడంతో వారు మరింత రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూముల్లో తెల్లరాయిని తవ్వి రాత్రికి రాత్రే అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటిదే గూడూరు రూరల్ మండలంలో చోటు చేసుకుంది.

ఆక్రమించి..అక్రమంగా తరలించి

మండల పరిధిలోని చెన్నూరు రెవెన్యూ బిట్-2 తుంగపాళెం గ్రామ సమీపంలో మూత పడిన మైనింగ్ ఫ్యాక్టరీకి ఎదురుగా 70 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిలో విస్తారంగా తెల్లరాయి, వర్మిక్యులేట్‌లు దొరుకుతున్నాయి. స్థానిక రెవెన్యూ పరిధిలోని ఇద్దరు నాయకులు వాటిపై కన్నేశారు. తమ అనుచరులతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. ఆపై తెల్లరాయిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

రాత్రిపూట బ్లాస్టింగ్..పగలు తరలింపు

సదరు భూముల్లో గత నెల రోజులుగా రాత్రి పూట బ్లాస్టింగ్ కూడా చేస్తున్నట్టు తెలుస్తోంది. బ్లాస్టింగ్ అనంతరం తవ్వకాలు చేసి పట్టపగలు లోడింగ్ చేసుకుంటున్నారు. ఇలా తవ్వి తీసిన తెల్లరాయిని మూత వేసి ఉన్న మైనింగ్ కంపెనీలోకి తరలించి అక్కడ గ్రేడింగ్ చేసి తరలిస్తున్నట్లు సమాచారం. ఇదేగాక విద్యుత్ టవర్లకు పక్కన కూడా తవ్వేస్తున్నారు. దీంతో సమీప గ్రామాల రైతులు భయాందోళనకు లోనవుతున్నారు.

రోజూ టిప్పర్లలో తరలింపు

రాత్రి సమయంలో ప్రభుత్వ భూముల్లో బ్లాసింగ్ చేసి గ్రేడింగ్ చేసిన తెల్లరాయిని టిప్పర్లలో నింపి తరలిస్తున్నారు. బ్లాస్టింగ్ వల్ల చుట్టుపక్కల ఉన్న మూడు గ్రామాల వారికి కంటి మీద కునుకు లేకుండా పోతోంది. తెల్లరాయి తరలింపునకు ఎలాంటి అనుమతులు లేకపోయినా అధికార పార్టీ నాయకుల అండతో యథేచ్ఛగా తరలించేస్తునఆనరు. ఎవరైనా అడిగితే స్థానిక ప్రజాప్రతినిధికి చెందిందని చెప్పడంతో అధికారులు కూడా అటువైపు వెళ్లేందుకు సాహసించడంలేదు.

ఆ ఇద్దరి కనుసన్నల్లోనే..

చెన్నూరు గ్రామానికి చెందిన ఇద్దరు అధికార పార్టీ నాయకులకు ఖనిజ సంపదపై పెత్తనాన్ని స్థానిక ప్రజాప్రతినిధి కట్టబెట్టినట్లు తెలుస్తోంది. చెన్నూరు ప్రాంతంలో మట్టి, గ్రావెల్, తెల్లరాయి, వర్మికంపోస్టు లాంటివి తరలించాలంటే ఆ ఇద్దరు నాయకుల నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. ఎవరైనా కొనుగోలుదారులు వచ్చినా వారిని కలసి ధరలు మాట్లాడుకోవాల్సిందే. ఇంత జరుగుతున్నా స్థానిక రెవెన్యూ అధికారి కనీసం అటు వైపుకు కన్నెత్తి కూడా చూడక పోవడం వెనుక ఆంతర్యమేమిటో అర్థంకాని పరిస్థితి.

చర్యలు తీసుకుంటాం

కొత్త తుంగపాళెం గ్రామ సమీపంలో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా తవ్వకాలు చేస్తున్న విషయం తెలియదు. వెంటనే వీఆర్‌ఓను పంపి ఎంత మేర తవ్వకాలు చేశారనే విషయాలను గుర్తిస్తాం. ఆ తర్వాత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్రమార్కులపై చర్యలు చేపడుతాం.

– చంద్రశేఖర్, తహసీల్దార్, గూడూరు

క్లుప్తంగా

సీఎంకు సాదర వీడ్కోలు



సీఎంకు వీడ్కోలు పలుకుతున్న అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): సీఎం చంద్రబాబునాయుడుకు రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. తిరుమల పర్యటన అనంతరం శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో టీటీడీ ఈఓ శ్యామలరావు, డీఐజీ షిమోషి బాజ్పాయ్, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సల్, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు, రేణిగుంట తహసీల్దార్ సురేష్‌బాబు తదితరులు సాదర వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు వెళ్లారు.

గాయపడిన వ్యక్తి మృతి

పాకాల: రెండు రోజుల క్రితం కారు, స్కూటరు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో గాయపడిన స్కూటరిస్ట్ స్విమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 19వ తేదీన నేంద్రగుంట బ్రిడ్జ్ వద్ద జరిగిన ప్రమాదంలో పెనుమూరు మండలం, కత్తిరెడ్డిపల్లి పంచాయతీ, గాగమ్మవారిపల్లి గ్రామానికి చెందిన బీ.భాస్కర్‌నాయుడు(48) గాయపడ్డాడు. శుక్రవారం మధ్యాహ్నం తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ భాస్కర్‌నాయుడు మృతి చెందారు. ఏఎస్ఐ వెంకట్రామానాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 58,872 మంది స్వామివారిని దర్శించుకోగా 23,523 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.71 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

పశువులకు వడదెబ్బ ముప్పు

- పాలదిగుబడిపై ప్రభావం చూపే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పశువైద్యాధికారులు



ప్రసాద్, పశువైద్యాధికారి, సైదాపురం

సైదాపురం: వేసవిలో పశువులను నిర్లక్ష్యం చేస్తే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. దీనికారణంగా పాల దిగుబడి తగ్గుముఖం పడుతుంది. మరికొన్ని మృత్యువాత పడుతాయి. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే పాడిపశువులను కాపాడుకోవచ్చు అని సైదాపురం మండల పశువైద్యాధికారి బొడ్డు ప్రసాద్ సూచించారు. ఇంకా ఆయన ఏం చెప్పారంటే..

వడ దెబ్బకు శరీర ప్రక్రియ మందగిస్తుంది

వేసవిలో పశువుల శరీర ఉష్ణోగ్రతకంటే బయటి ఉష్ణోగ్రత అధికమైనప్పుడు మెదడులోని హైపోదలామస్ స్వేద గ్రంధుల నిర్వాహణపై పర్యవేక్షణ కోల్పోతాయి. చెమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడీ వేగం పెరుగుతుంది. మూత్ర పిండాలు సరిగా పనిచేయవు. దీంతో పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి శ్వాస ఆడక మరణించే ప్రమాదం ఉంది.



ఎండలో కట్టేసి ఉన్న పశువులు

నివారణ చర్యలు

వేసవిలో పశువులను మేతకు వదలరాదు. ఉదయం, సాయంత్ర చల్లగా ఉన్నప్పుడు మాత్రమే పశువులను బయటకు తోలాలి. పశువులను రోజుకు మూడునాలుగు సార్లు చల్లటి నీటితో కడగాలి. నాటు జాతి పశువుల కంటే సంకరజాతి ఆవులు, గేదెలు త్వరగా వడదె దెబ్బకు గురవుతాయి. రేకుల కప్పులు ఉన్న పశువుల షెడ్లపై గడ్డిని కప్పి మధ్యాహ్న వేళ్లలో నీళ్లను చల్లుతుండాలి. వడ గాలుల ప్రభావం పడకుండా గోనె సంచి పరదాలను ఏర్పాటు చేసుకోవాలి.



మేతకు వెళ్తున్న ఆవులు, గేదెలు

చికిత్స విధానం

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుకోవడానికి పలుమార్లు చల్లటి నీటితో కడగాలి. ఆ తర్వాత పశువైద్యాధికారులను సంప్రందించాలి. వేడిని తగ్గించే ఇంజెక్షన్ వేయాలి. రక్తంలో డెక్ట్రోజ్‌సైలెన్ ఎక్కించడం వల్ల శరీరానికి సరిపడా గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్స్ అంది పశువులు నీరసం నుంచి బయటపడుతాయి.

జిల్లా సమాచారం

డివిజన్	ఆవులు	గేదెలు
గూడూరు	30517	1.27.462
శ్రీకాళహస్తి	83433	46.205
తిరుపతి	1.04.319	11.334
సూళ్లూరుపేట	41.479	1.08.740
మొత్తం	2,59,748	2,93,741

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువులు శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం గట్టి పడుతుంది. నోటి వెంట సొంగ కారుతుంది. నీడ కోసం చెట్టుకింద చేరి కూలబడుతాయి. శ్వాస పీల్చడం కష్టమవుతుంది. పశువులు క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి. శరీర ఉష్ణోగ్రత 103 నుంచి 109 డిగ్రీల దాటితే ప్రమాదం ఉంటుంది. వడదెబ్బ ప్రభావంతో చూడి పశువుల్లో గర్భస్రావం సంభవిస్తుంది. దూడలు అతిసార వ్యాధితో మృత్యువాత పడుతాయి.

ప్రైవేట్ స్కూళ్లపై ఫిర్యాదు



డీఈఓకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి అర్బన్ : వేసవి నేపథ్యంలో జిల్లాలోని అన్ని పాఠశాలలు ఒంటి పూట తరగతులు నిర్వహించాలని జారీ చేసిన ఆదేశాలను ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు బేఖాతర్ చేస్తున్నారని విద్యార్థి సంఘాల నేతలు మండిపడ్డారు. శుక్రవారం ఈ మేరకు డీఈఓ కేవీఎన్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించి డీఈఓ మాట్లాడుతూ పకడ్బందీగా తనిఖీలు చేపడతామని, ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు హేమాద్రి యాదవ్, ప్రేమ్ కుమార్, లోకేష్, యుగంధర్, ముని , సుకుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు



కలెక్టరేట్‌లో ఏఎస్పీ రవిమనోహరాచారి నేతృత్వంలో తనిఖీలు

- పోలీసులకు ఈ మెయిల్...
- అప్రమత్తమైన ఏఎస్పీ
- తిరుచానూరు పోలీసులతో గాలింపు
- హోటల్స్ నుంచి కలెక్టరేట్‌కు పాకిన బాంబు బెదిరింపులు
- సాయంత్రం 4.30 - 4.45 గంటల మధ్యలో పోలీసులకు మెయిల్
- 5.15 గంటల నుంచి 6.45 గంటల వరకు తనిఖీలు

తిరుపతి అర్బన్: కలెక్టర్ కార్యాలయంలోనే బాంబు పెట్టినట్లు గుర్తుతెలియని వ్యక్తులు పోలీసులకు శుక్రవారం ఈ మెయిల్ పంపించారు. వెంటనే స్పందించిన ఏఎస్పీ రవి మనోహరాచారి నేతృత్వంలో తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐలు కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కలెక్టరేట్‌లో వంద మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్న నేపథ్యంలో వారంతా ఆందోళన చెందకుండా సాదారణ తనిఖీల్లో భాగంగానే వచ్చామంటూ ఏబ్లాక్, బీ బ్లాక్‌తోపాటు అన్ని గదులను, టాయిలెట్స్‌ను, దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అయితే ఎక్కడా ఏమీ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తమకు వచ్చిన ఈ మెయిల్ ఫేక్‌గా భావించారు. శుక్రవారం సాయంత్రం 4.30- 4.45 గంటల మధ్య పోలీసులకు ఈ మెయిల్ రావడంతో 5.15 గంటలకే కలెక్టరేట్‌కు చేరుకున్న పోలీసులు సాయంత్రం 6.45 గంటల వరకు తనిఖీలు చేపట్టారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్య రక్షణ



మహిళలకు కిట్లు అందిస్తున్న సుమతి, కలీముల్లా

తిరుపతి సిటీ : ఆరోగ్య రక్షణలో చిరుధాన్యాలు కీలకపాత్రం పోషిస్తాయని ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కలీముల్లా తెలిపారు. శుక్రవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ×చిరుధాన్యాలపై అవగాహన, ప్రాసెసింగ్ యంత్రాల సందర్శన్ల అనే అంశంపై 25 మంది ఎస్సీ మహిళలకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు తీసుకుంటే శరీరానికి పోషకాలు పుష్కలంగా అందుతాయని చెప్పారు. అనంతరం చిరుధాన్యాలను శుద్ధి చేయడం, పొట్టు తీయడం, తినుబండారాల తయారీపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే రక్తపోటు, చక్కెర వ్యాధి, అధిక కొవ్వును అరికట్టవచ్చని వెల్లడించారు. అనంతరం మహిళలకు కిట్, సర్టిఫికెట్లతో పాటు తినుబండారాలను పంపిణీ చేశారు.

ఎస్పీడబ్ల్యూలో బయోటెక్ ఫెస్ట్



ఫెస్ట్ ప్రారంభిస్తున్న అతిథులు, ప్రిన్సిపల్

తిరుపతి సిటీ :పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల బయోటెక్నాలజీ విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ నారాయణమ్మ అధ్యక్షతన శుక్రవారం బయోటెక్ రెవల్యూషన్ ది నెక్స్ ఫ్రాంటియర్-ట్రాన్స్‌ఫార్మింగ్ సైన్స్ టు సొల్యూషన్ అనే అంశంపై బయోటెక్ ఫెస్ట్ నిర్వహించించారు.ఐజర్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో బయోటెక్నాలజీ పాత్ర, ప్రాముఖ్యత, అవకాశాలపై అవగాహన కలిగించారు. అనంతరం బయోటెక్నాలజీ సైన్స్ ఎక్స్‌పో ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ బుడోల్లాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ బి.విశ్వనాథ్, విభాగాధిపతి డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ భద్రమణి, అధ్యాపకులు హేమలత, కుసుమ పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయ విచారణ

తిరుపతి అర్బన్: తిరుమలలోని వైకుంఠ ద్వార దర్శనం నిమిత్తం టీటీడీ వారు ఈ ఏడాది జనవరి 8న జారీ చేసిన టోకెన్ల సందర్భంగా నెలకొన్న తొక్కిసలాటపై జ్యుడీషియల్ విచారణ కొనసాగుతోంది. అందులో భాగంగా జ్యుడీషియల్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తి శుక్రవారం అప్పటి టీటీడీ సీవీఎస్వో శ్రీధర్‌తోపాటు డీఎస్పీ రమణకుమార్, ఇద్దరు సీఐలను, ఇద్దరు ఎస్ఐలను విచారణ చేపట్టారు. అలాగే శనివారం టీటీడీ అప్పటి గోశాల డైరెక్టర్ హరినాథ్‌రెడ్డితోపాటు నలుగురు విజిలెన్స్ అధికారులను, తమిళనాడుకు చెందిన ఓ భక్తుడు, మహారాష్ట్రకు చెందిన మరో భక్తుడిని విచారించనున్నారు.

పది ఎకరాల అటవీ భూమి కబ్జాకు యత్నం




అటవీ సమీపంలోనే యథేచ్ఛగా చదును

సాక్షి టాస్క్‌ఫోర్స్: వెంకటగిరి నియోజకవర్గం, కలువాయి మండలం, తోపుగుంట సమీపంలోని పది ఎకరాల అటవీ భూమిని ఓ వ్యక్తి అక్రమించుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నాడు. ఆ భూమి సాక్షాత్తు సోమశిల అనుసంధానమైన చెన్నై కాలువ సమీపంలో ఉండడం గమనార్హం. కోట్లాది రూపాయల విలువ చేసే భూమిని కలువాయికి చెందిన ఓ వ్యక్తి చదును చేసి సాగు చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాడు. అలాగే ఆ భూమి సమీపంలోనే మరో 4.88 సెంట్లు ఓ వ్యక్తికి అసైన్‌మెంట్ పట్టా ఇవ్వగా.. ఆ భూమిని కూడా ఆ వ్యక్తి కొనుగోలు చేసి మొత్తంగా సాగులోకి తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయం అంతా సంబంధిత అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్టు వ్యవహరిస్తుండడం గమనార్హం.


రుయా పెస్ట్ ఏజెన్సీపై చీటింగ్ కేసు

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో పెస్ట్ కంట్రోల్ నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన సాయి సెక్యూరిటీ ఏజెన్సీస్ మేనేజింగ్ డైరెక్టర్ స్వామిరెడ్డి పై చీటింగ్ కేసు నమోదైంది. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు వివరాలు.. ఎస్వీ మెడికల్ కళాశాల తోపాటు రుయా, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో పెస్ట్ అండ్ రోడెంట్ కంట్రోల్ సర్వీసెస్ నిర్వహించేందుకు సాయి సెక్యూరిటీ ఏజెన్సీ 2021 ఆగస్టు ఒకటిన ప్రభుత్వం నుంచి కాంట్రాక్టు పొందింది. ఆ సంస్థ తిరుపతికి చెందిన ఎన్.రేణుకకు సబ్‌కాంట్రాక్టు ఇచ్చింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి 39 నెలలకు గాను బ్యాంక్ గ్యారంటీని రేణుక తన ఫిక్సిడ్ డిపాజిట్ ద్వారా మొత్తాన్ని చెల్లించింది. 13 నెలల తర్వాత సబ్ కాంట్రాక్టర్ నుంచి ఆమెను తప్పించారు. అయితే నాలుగేళ్లు కావస్తున్నా సబ్ కాంట్రాక్టర్‌గా బ్యాంక్ గ్యారంటీ ఇచ్చిన ఎన్.రేణుకాకు వాటిని సకాలంలో తిరిగి చెల్లించలేదు. అవుట్ స్టాండింగ్ మొత్తాన్ని ఇవ్వకుండా మోసగించారు. ఆమె బ్యాంక్ గ్యారంటీ పైనే ఇన్ని రోజులు సాయి సెక్యూరిటీ ఏజెన్సీస్ పెస్ట్ కంట్రోల్ నిర్వహిస్తూ వస్తోంది. ఇలా చేయడం చట్టరీత్యా నేరం. సబ్ కాంట్రాక్టర్ అనేకమార్లు ఈ వ్యవహారంపై రుయా, మెడికల్ కళాశాల, ప్రసూతి ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేసింది. తనకు అవుట్ స్టాండింగ్ మొత్తాన్ని ఇవ్వాల్సి ఉందని, బ్యాంకు గ్యారంటీలను తిరిగి చెల్లించనందున ఏజెన్సీకి బిల్లులు చెల్లించవద్దని ఫిర్యాదులో పేర్కొంది. బ్యాంకు గ్యారంటీ తిరిగి ఇవ్వాలని అనేక మార్లు సాయి ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ స్వామి రెడ్డికి కోరినా స్పందించకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసిన విచారిస్తున్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఎంపిక



తలారి బాలకృష్ణ అధ్యక్షులు



దాసరి జనార్దన్ ప్రధాన కార్యదర్శి

వరదయ్యపాళెం: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు తెలిపారు. శ్రీకాళహస్తిలోని సుందరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో తిరుపతి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులుగా తలారి బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దాసరి జనార్దన్, జిల్లా ఉపాధ్యక్షులుగా గురవమ్మ, ఎస్.రమణయ్య, వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శులుగా ముత్యాలయ్య, రాజగోపాల్, రామచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సుబ్బమ్మ, నారాయణ, శంకరయ్య, కత్తి గురవయ్య, బాలగురవయ్య, వెంకటకృష్ణయ్య, అముద, శ్రీనివాసులు, హరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు.

'కళైకావేరి'తో ఎస్వీయూ ఒప్పందం



ఎంఓయూ మార్చుకుంటున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ : తమిళనాడులోని తిరుచిరాపల్లెకు చెందిన కళై కావేరి లలిత కళల కళాశాలలో పలు అంశాలపై ఎస్వీయూ కళలప్రదర్శన అధ్యయన విభాగం శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు అధ్యాపకులు, విద్యార్థులు పరస్పర అభ్యసన, పరిశోధన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించునే వెసులుబాటు ఉంటుంది. కార్యక్రమలో ఆచార్య శంకర్ గణేష్, ఆచార్య ఉమామహేశ్వరి, డాక్టర్ పత్తిపాటి వివేక్, ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

రుయాలో ప్రపంచ డౌన్స్ సిండ్రోమ్ దినోత్సవం



కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, రుయా వైద్యులు

తిరుపతి తుడా: రుయా పీడియాట్రిక్స్ విభాగం ఆధ్వర్యంలో డీఈఐసీ భవనంలో శుక్రవారం ప్రపంచ డౌన్స్ సింద్రోమ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్, రుయా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్, పీడియాట్రిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ మనోహర్ కార్యక్రమంలో పాల్గొని డౌన్స్ సింద్రోమ్ లక్షణాలు, కారణాలు, నిర్వహణ అనే అంశాలపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్, డాక్టర్ గుణశేఖర్, ఝాన్సీరాణి, డాక్టర్ సుప్రజ దేవి, దీప్తి, సరస్వతి, చైతన్య పాల్గొన్నారు.

పుత్తూరు రైటర్ వీఆర్‌కు!

– రాజకీయ ఒత్తిళ్లే కారణమా?

పుత్తూరు : స్థానిక పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ బి.రవి తిరుపతి ఎస్పీ ఆదేశాల మేరకు వీఆర్ (వేకన్సీ రిజర్వుడు)కు బదిలీ అయ్యారు. గురువారం జరిగిన ఈ బదిలీ కేవలం స్థానికంగా ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. పోలీస్ స్టేషన్‌కు వివిధ కేసుల్లో పట్టుకొస్తున్న నిందితులను స్థానిక టీడీపీ నాయకులు వారు మావారే వదిలి పెట్టాలంటూ పోలీసులపై అధికార జులుం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఇలాంటి ఘటనలపైనే ఇలా అయితే మా ఉద్యోగాలు ఎలా చేయాలంటూ రైటర్ రవి ప్రశ్నించడంతో అతనిని టార్గెట్ చేసి వీఆర్‌కు పంపించినట్లు తెలుస్తోంది. చూశారా మేము చెప్పింది చేయకపోతే ఇలానే ఉంటుందంటూ స్థానిక పోలీసు ఉన్నతాధికారులకు టీడీపీ నాయకులు హెచ్చరికలు పంపుతున్నారు. రాజకీయంగా తమ పలుకుబడిని చూపేందుకే చిరుద్యోగిపై ప్రతాపం చూపారంటూ పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

నేటి నుంచి అంతర్జాతీయ వర్క్‌షాపు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ వేదికగా శనివారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు రామరంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో శాబ్దబోధ మీమాంశ అనే అంశంపై వారం రోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ వర్క్‌షాప్‌లో పద్మభూషణ నవలపాకం శతకోప రామానుజతాచార్య రచనలో వివరించిన శాబ్దబోధంపై తత్వశాస్త్ర, భాషా విశ్లేషణ జరగనుంది. దర్శన, వ్యాకరణ విభాగాలలో పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులను లక్ష్యంగా చేసుకుని, స్ఫోటవాదం, అభిహితాన్వయ, అన్వితాభిధానవాదం వంటి ముఖ్యమైన అంశాలపై మహాపండితులు చర్చించనున్నారు. ఆసక్తిగల వారు రిజిస్ట్రేషన్‌తో పాటు మరిన్ని వివరాలకోసం ప్రొఫెసర్ సి రంగనాథన్ 94409 19106, డాక్టర్ ఓజీపీ కళ్యాణ శాస్త్రి 88856 73667లను సంప్రదించాలని వర్సిటీ అధికారులు ఒక ప్రకటలో తెలిపారు.

సిద్ధార్థను సందర్శించిన జపాన్ బృందం



చర్చించుకుంటున్న ఒబెర్లిన్, సిద్ధార్థ కళాశాల బృందాలు

నారాయణవనం: మండలంలోని సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలను జపాన్‌కు చెందిన జేఎస్ ఒబెర్లిన్ యూనివర్సిటీ బృందం శుక్రవారం సందర్శించింది. విద్యార్థులు, అధ్యాపకుల పరస్పర ఎక్స్చేంజ్, ఉద్యోగ కల్పన విషయంలో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ అశోకరాజు తెలిపారు. జేఎఫ్ ఒబెర్లిన్ యూనివర్సిటీ ప్రతినిధులు ఫుమిటేకనకముర, టాకేరు తెరసావా, న్యూఢిల్లీకి చెందిన నీరూధావ్ కళాశాలలో మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, ఆడిటోరియం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను సందర్శించారు. అనంతరం జపాన్ యూనివర్సిటీ బృందంతో అశోకరాజుతో పాటు కళాశాలల ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దనరాజు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు సమావేశమయ్యారు. అశోకరాజు మీడియాతో మాట్లాడుతూ సిద్ధార్థ కళాశాల, ఒబెర్లిన్ యూనివర్సిటీలు టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, పరిశోధన, ఇండస్ట్రీ టయప్‌తో పాటు ఆఫర్ చేస్తున్న కోర్సులను మ్యాపింగ్ చేస్తూ కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రెండు విద్యా సంస్థలు పరస్పరం అధ్యాపకులను, విద్యార్థులను ఎక్స్చేంజ్ చేసుకుంటూ ఇంజినీరింగ్ విద్యార్థులకు కొత్త కోర్సులతో మంచి భవిష్యత్‌ను అందించనున్నట్లు అశోకరాజు తెలిపారు.